క్లుప్తంగా

జడ్జెస్‌కాలనీ నూతన కార్యవర్గం


అధ్యక్షుడు చంద్రారెడ్డి

మన్సూరాబాద్‌: డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు గురువారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.చంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా రజనాల చంద్రకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా టంగుటూరి నాగరాజు, రవికుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్ రావు, కోశాధికారిగా కాశీవర్ధన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా రాంమోహన్, అనంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాలరాజు, రాజు, స్వామిగౌడ్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, షాబుద్దీన్, రాములు, జయరామ్‌ను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల వితరణ



సైదాబాద్‌: సైదాబాద్ డివిజన్ జయానగర్ కాలనీలోని దివ్యజ్యోతి ఆశ్రమంలోని అనాథ విద్యార్థులకు 15 రోజులకు సరిపడా బియ్యం, పప్పులు, నిత్యావసరాలు, నోట్‌బుక్స్‌ను నవారు భారతి ట్రస్ట్ చైర్మన్, ఆదర్శ్ కన్‌స్ట్రక్షన్ అధినేత నవారు సుదర్శన్‌రెడ్డి అందజేశారు. నవారు అనిష్‌రెడ్డి, దివ్యజ్యోతి ఫౌండేషన్ ప్రతినిధి అనంత్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో నివాసముండే మూల వినోద్‌గౌడ్(37) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి భార్య శశిచిత్రతో పాటు రెండు నెలల కుమారుడు ఉన్నాడు. తల్లిదండ్రులు గ్రౌండ్‌లో ఫ్లోర్‌లో ఉంటుండగా వినోద్‌గౌడ్ మొదటి అంతస్తులో ఉంటున్నాడు. ఉద్యోగం చేయగా వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. కుటుంబంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులపై మనోవేదన చెందేవాడు. డ్యూటీకి వెళ్లిన వినోద్‌గౌడ్ బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. స్నానం చేసేందుకు మొదటి అంతస్తుకు వెళ్లి ఎంతకీ కిందకు రాకపోవడంతో తల్లి పైకివెళ్లి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ప్రజల కోసం యజ్ఞం అభినందనీయం


యజ్ఞంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి

లింగోజిగూడ: ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అష్టైశ్వర్యాలు కలగాలని యజ్ఞం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న సర్వ సౌభాగ్య దేవిత్రయ గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. అనంతరం మంత్రి సబితఇంద్రారెడ్డిని శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు మురుకుంట్ల రాజేశ్వరశర్మ, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, కాచం సత్యనారాయణ, అరవింద్‌శర్మ పాల్గొన్నారు.

అదుర్స్.. కెనడియన్ వుడ్ విల్లా

మహేశ్వరం: కెనడియన్ వుడ్‌తో నిర్మించిన విల్లాలు అద్భుతంగా ఉన్నాయని కెనడా అటవీ మంత్రిత్వ శాఖ, డిప్యూటీ మినిస్టర్ రిచర్డ్ గైమాన్వరింగ్ పేర్కొన్నారు. కెనడాకు చెందిన ఫారెస్ట్రీ ఇన్నోవేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా మిషన్ ప్రోగ్రామ్ - 2023లో భాగంగా కెనాడ అటవీ మంత్రిత్వ శాఖ, డిప్యూటీ మినిష్టర్ రిచర్డ్ గైమాన్వరింగ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం మండలంలోని తుమ్మలూరు గ్రామం మ్యాక్ ప్రాజెక్టులోని కెనడియన్ వుడ్ ప్రాజెక్టును గురువారం సందర్శించింది. మ్యాక్ బీటీఆర్ భారత దేశంలో పర్యావరణహితంగా విలాసవంతమైన చెక్క గృహాలను అభివృద్ధి చెయడానికి, ప్రోత్సహించడానికి కెనడియన్ వుడ్ సంస్థతో కలిసి పని చేస్తోంది. కెనడియన్ ప్రతినిధి బృందం సభ్యులు పెర్రీ జోనాధన్ టీస్టేల్, బ్రూస్ సెయింట్ జాన్, జాన్ లాంగ్లీ, సుఖ్‌దేవ్ డేవిడ్, మైఖల్ లోసెత్, మ్యాక్ ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కంటి వెలుగు



మన్సూరాబాద్ భవానీనగర్‌కాలనీలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చంపాపేట, మన్సూరాబాద్, గడ్డిఅన్నారం డివిజన్లలో గురువారం ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు వరంలాంటిదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలకు దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభలో పలువురు ముఖ్యమంత్రులు పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. కంటి వెలుగు కార్యక్రమంతో కంటిచూపు కోల్పోయిన పేద వృద్ధులకు కంటిచూపుతో పాటు అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ చేయాల్సి వస్తే సరోజినిదేవి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దయానంద్, డీసీలు మారుతిదివాకర్, హరికృష్ణయ్య, సురేందర్‌రెడ్డితోపాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- మన్సూరాబాద్ డివిజన్ భవానినగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు.
- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ కళ్యాణమండపంలో కార్యక్రమాన్ని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.
- గడ్డిఅన్నారం డివిజన్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు.
- న్యూదిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సరూర్‌నగర్ డీసీ కృష్ణయ్య, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహగుప్తా ప్రారంభించారు.
- హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీహాల్‌లో డీసీ సురేందర్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ సుజాత నాయక్ ప్రారంభించారు.
- కొత్తపేట డివిజన్ మారుతినగర్ మహిళా భవన్‌లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.
- నాగోలు డివిజన్ జైపురికాలనీలో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ప్రారంభించారు.
- చంపాపేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీ పార్క్, కృష్ణనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్యతో కలిసి గురువారం ప్రారంభించారు. పీఓ విక్రాంత్‌రెడ్డి, సీఓ సైదులు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, కాలనీ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీపురంకాలనీ కమ్యూనిటీ హాల్‌లో..

మలక్‌పేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీపురంకాలనీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ ఏఎంహెచ్‌ఓ బ్రిజున్నీసా, జీహెచ్‌ఎంసీ డీసీ జయంత్, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ శిల్పా, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరుణ్ తదితరులు ఉన్నారు.


కొత్తపేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కార్పొరేటర్ పవన్‌కుమార్


చంపాపేటలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి


బీఎన్‌రెడ్డినగర్‌కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి


ఆర్‌కేపురంలో కంటి వెలుగులో కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, డీసీ కృష్ణయ్య

ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ పనులు షురూ..


నాగోలు నుంచి ప్రారంభమైన ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ పనులు

నాగోలు: నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న మోడల్ కారిడార్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో నాగోలు మూసీ వంతెన నుంచి ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్డు వైపు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ అభివృద్ధి కోసం రూ.360 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మోడల్ కారిడార్ల పనులు నాగోలు చౌరస్తా నుంచి ప్రారంభమయ్యాయి. ఫుట్‌పాత్, సైక్లింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయి. నాగోలు మూసీ నుంచి ఎల్‌బీనగర్ చౌరస్తా వరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. మోడల్ కారిడార్లు అందుబాటులో వస్తే నాగోలు, అల్కాపురి చౌరస్తా, ఎల్‌బీనగర్ చౌరస్తా ఎంతో ఆకర్షణీయంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తా


ఆదర్శ్‌నగర్‌కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: డివిజన్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. హయత్‌నగర్ పరిధి ఆదర్శనగర్‌కాలనీలో గురువారం ఆయన మార్నింగ్ వాక్ చేసి కాలనీవాసుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరలోనే చేపడతానని తెలిపారు. పలు కాలనీల్లోని పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, కాలనీలోని పార్కు స్థలం కబ్జా కాకుండా జాగ్రత్త వహించాలని కాలనీవాసులకు సూచించారు. కాలనీవాసులు రాజ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, నర్సింహ, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, దివాకర్, మహేష్, సుదర్శన్, శ్రీకాంత్, గోపి, పరిపూర్ణాచారి తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో మురుగు పరుగు


మార్కెట్ ప్రాంగణంలో పారుతున్న మురుగు

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మురుగు వరదలా పారుతూ రైతులు తెచ్చిన మిర్చి బస్తాలు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాంగణంలో ఎక్కడ చూసినా గురువారం ఇవే దృశ్యాలు కనిపించాయి. ఏళ్ల గడుస్తున్నా మార్కెట్‌లో మురుగు సమస్యకు పరిష్కారం లభించడం లేదు. మార్కెట్ అధికారులు, పాలకవర్గం మురుగు సమస్యపై దృష్టి సారించాలని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు


డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో డ్రైనేజీ పొంగి రోడ్లపై పారుతోందని కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు రోడ్లపైకి రాకుండా డ్రైనేజీని ఆధునీకరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఏఈ రాకేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ సంజీవరెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాము, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములను స్వీకరించాలి

అన్నోజిగూడ సర్పంచ్ కాకి ఇందిర


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ ఇందిర, తదితరులు

కందుకూరు: గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నోజిగూడ సర్పంచ్ కాకి ఇందిర సూచించారు. మండలంలోని అన్నోజిగూడలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు గురువారం ఆమె బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ తండా జట్టుకు రూ. 5 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన బండమీది గూడూరు జట్టుకు రూ. 2500 నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం ఏర్పడడంతో పాటు మానసిక, శారీరకధారుఢ్యం పెంపొందుతుందన్నారు. అందరూ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీ శ్రీహరి, కాకి దశరథ, సేవాలాల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరాథోడ్, వార్డు సభ్యులు కృష్ణ, మహేందర్, లక్ష్మణ్, వేణు, సురేష్, నిర్వాహకులు ఢిల్లీ శివ, మల్లేష్, సుధాకర్, కిరణ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పర్యటన



హయత్‌నగర్: డివిజన్‌లోని పలు కాలనీల్లో డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్‌తో కలిసి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి గురువారం పర్యటించారు. శ్రీనివాస్, బలరాం తదితరులు ఉన్నారు.

నాల్గో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి


మృతి చెందిన జ్ఞాన ప్రకాష్ హేమంత్

నాగోలు: గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు నాల్గో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు అరుణోదయకాలనీ రోడ్డు నెం.8, ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో నివసించే రావూరి కిషోర్, స్వర్ణలత దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రావూరి జ్ఞానప్రకాష్ హేమంత్(23) గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్నాడు. రాత్రి సమయంలో చదువుకుంటూ నిద్ర వచ్చినప్పుడు నాల్గో అంతస్తుకు వెళ్లి వాకింగ్ చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున నిద్ర వస్తున్నట్లు అనిపించడంతో అపార్ట్‌మెంట్ నాల్గో అంతస్తుకు వెళ్లి గోడపై కూర్చున్నాడు. నిద్ర మత్తులో విద్యుత్ వైర్లపై పడి అక్కడి నుంచి నేలపై పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు బయటకు వచ్చి చూడగా హేమంత్ కిందపడి తీవ్ర గాయాలతో కనిపించాడు. వెంటనే 108లో ఎల్‌బీనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి కిషోర్ ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

11 కిలోమీటర్లు.. 12 నిమిషాలు..

- మలక్‌పేట టూ కిమ్స్ హాస్పిటల్
- ప్రాణం కాపాడేందుకు ఆర్గాన్స్ తరలింపు


ట్రాఫిక్ పోలీసుల గ్రీన్‌ఫీల్డ్‌తో లైవ్ ఆర్గాన్స్ తరలిస్తున్న అంబులెన్స్

చాదర్‌ఘాట్: నగర పౌరుల సంరక్షణకు నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం ప్రాధాన్యం ఇస్తోందని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు రెండుసార్లు గ్రీన్ ఫీల్డ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మానవ అవయవాల రవాణాకు సహకరించామని ఆయన తెలిపారు. మలక్‌పేట యశోద ఆసుపత్రి నుంచి 11కి.మీ. దూరంలో ఉన్న కిమ్స్ ఆసుపత్రి వరకు గురువారం గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటు చేసి 12 నిమిషాల్లో ఆర్గాన్స్ రవాణా చేసేందుకు సహకరించినట్లు ఆయన తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటుతో అంబులెన్స్‌లో గుండె, లంగ్స్ రవాణా చేసి ఒకరి ప్రాణం కాపాడామని ఆయన తెలిపారు.

పుస్తకాలతో దోస్తీ..
పోటీ పరీక్షలకు కుస్తీ

- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా
- సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయం
- అందుబాటులో 20వేల పుస్తకాలు



సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయం


పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ కోసం ఇటీవల పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో స్థానిక యువతే కాదు శివారు జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు సైతం నగరానికి చేరుకున్నారు. పోటీ పరీక్షల కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. ఇతర సమయంలో సరూర్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణంతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ మొత్తం ఒకేచోట లభిస్తుండడంతో యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. ఫలితంగా నిన్న మొన్నటి వరకు ఖాళీగా కనిపించిన లైబ్రరీ హాళ్లు, కుర్చీలు ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో కలకలలాడుతున్నాయి.

చదువుతూ.. నోట్ చేసుకుంటూ..


పోలీసు కానిస్టేబుల్, గ్రూప్ –1 ,2, 3, 4 పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌తో పాటు చరిత్ర, పరిశోధన ప్రముఖ గ్రంథాలు, తెలుగు, ఇంగ్లిష్ డైలీ, వార, పక్ష పత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. అభ్యర్థులు ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఎంపిక చేసుకుని రోజంతా చదువుతున్నారు. ముఖ్యమైన అంశాలను ఎప్పటికప్పుడు నోట్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు ఇక్కడికి వచ్చిన అభ్యర్థులకు లైబ్రరీ నిర్వాహకులు మంచి నీరు, 50 కుర్చీలు, టేబుళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

అన్ని పుస్తకాలు ఉన్నాయి

సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. మెటీరియల్ కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేనివారికే కాదు.. ఏ పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలో తెలియని అభ్యర్థులకు ఇది ఉపయుక్తంగా ఉంది.

– సుమలత, గ్రూప్–1 అభ్యర్థి

8 నుంచి 8 గంటల వరకు



లైబ్రరీలో మొత్తం 20 వేలకుపైగా పుస్తకాలు ఉన్నాయి. అన్ని తరగతులకు సంబంధించిన తెలుగు అకాడమీ పుస్తకాలతో పాటు వివిధ స్టడీ సర్కిళ్లకు సంబంధించిన మెటీరియల్ కూడా అందుబాటులో ఉంది. ఇక్కడికి రోజుకు కనీసం 200 మంది అభ్యర్థులు వస్తుంటారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు లైబ్రరీ తెరిచి ఉంటుంది. ఎవరైనా వచ్చి చదువుకోవచ్చు. ప్రశాంతతకు భంగం కలిగించే ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదు.

– వీరయ్య, పీటీడబ్ల్యూ